క్లుప్తంగా

పీఆర్‌టీయూ జిల్లా గౌరవాధ్యక్షుడిగా దుర్గయ్య



టేక్మాల్(మెదక్): పీఆర్ టీయూ మెదక్ జిల్లా గౌరవ అధ్యక్షుడిగా టేక్మాల్ మండలం కుసంగి ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం ఆకులపల్లి దుర్గయ్యను ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆయన ఇప్పటి వరకు పలుమార్లు మండల ప్రధాన కార్యదర్శిగా, అధ్యక్షుడిగా, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా పని చేశారు. ఈ సందర్భంగా జిల్లా గౌరవ అధ్యక్షుడిని జిల్లా పీఆర్టీయూ అధ్యక్షుడు సుంకరి కృష్ణ, మండల అధ్యక్షుడు అమీరొద్దీన్, ప్రధాన కార్యదర్శి సహదేవ్‌లతో పాటు జిల్లా, మండల నాయకులు అభినందనలు తెలిపారు. జిల్లా గౌరవ అధ్యక్షుడిగా తన ఎన్నికకు సహకరించినా ప్రతీఒక్కరికి దుర్గయ్య కృతజ్ఞతలు తెలిపారు.

మానవత్వం చాటిన ఎస్‌ఐ



వ్యక్తికి పండ్లు, తాగునీరు అందిస్తున్న ఎస్‌ఐ పోచయ్య

రేగోడ్(మెదక్): ఒక ఎస్‌ఐ మానవత్వం చాటారు. విధి నిర్వహణలో భాగంగా పోలీసు వాహనంలో వెళ్తుండగా యువకుడు కనిపించాడు. వెంటనే వాహనాన్ని ఆపి అతని వద్దకు వెళ్లి వివరాలు తెలుసుకునే ప్రయత్నం చేయగా ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. మతిస్థిమితం లేదని తెలుసుకున్నారు. పక్కన ఉన్న పండ్ల షాపు నుంచి పండ్లు, నీళ్ల బాటిల్ తీసుకొచ్చి ఇచ్చారు. ఆయన వెంట కానిస్టేబుల్ శ్రీనివాస్, ఉమెన్ కానిస్టేబుల్ హంసవేణి ఉన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ఉండాలి

విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు వెళ్లాలని ఎస్‌ఐ పోచయ్య అన్నారు. రేగోడ్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో ఆదివారం మహిళల రక్షణ, వ్యక్తిత్వ వికాసం, సైన్స్.. మూఢనమ్మకాల నిర్మూలన అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు.

తాగి వాహనం నడిపితే చర్యలు



డ్రంకెన్ డ్రైవ్ నిర్వహిస్తున్న పోలీసులు

పాపన్నపేట(మెదక్): తాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ ఆదివారం హెచ్చరించారు. మద్యం తాగి వాహనాలు నడిపిన 11 మందిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు ఏడుపాయల కమాన్ వద్ద డ్రంకెన్ డ్రైవ్ చేపట్టినట్లు చెప్పారు. వాహనదారులు రోడ్డు భద్రతా నియమాలు తప్పకుండా పాటించాలన్నారు. ఆదివారం భక్తుల భద్రత దృష్ట్యా ఏడుపాయల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏఎస్సై రమేశ్, సిబ్బంది తదితరులున్నారు.

సంక్షేమ పథకాలపై ప్రచారం



పథకాలపై ప్రచారం చేస్తున్న కళాబృందం

చిన్నశంకరంపేట(మెదక్): ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలపై ప్రజా కళాజాతర బృందం మండలంలో సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించింది. ఆదివారం మండలంలోని కామారం, మిర్జాపల్లి, మల్లుపల్లి గ్రామాలలో ఆటాపాట ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు తెలిపారు. కార్యక్రమంలో సాంస్కృతిక సారధి బృందం టీమ్ లీడర్ సిద్దు తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



వీణ

శివ్వంపేట(నర్సాపూర్): వివాహిత అదృశ్యమైన సంఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఏఎస్‌ఐ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని చెన్నాపూర్‌కు చెందిన మర్కంటి రాకేశ్ భార్య వీణ ఆదివారం తన అత్తమామలతో కలిసి పొలం పనులకు వెళ్లింది. భర్త కూడా పని కోసం శివ్వంపేటకు వెళ్లాడు. వీణ.. మధ్యాహ్నం దాకా పొలం పనులు చేసి ఇంటికి తిరిగొచ్చింది. అత్తమామ కూడా పనులు ముగించుకొని రాగా కోడలు కనిపించకపోవడంతో తెలిసిన వారి వద్ద వెతికినా ఫలితం లేకపోయింది. భర్త ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

• వేంకటేశ్వరస్వామి మహాపారాయణానికి రండి





ఎంపీ రఘునందన్, మాజీ ఎంపీ బీబీపాటిల్ ఆహ్వాన పత్రికను అందిస్తున్న నాయకులు

మెదక్ ఎంపీ రఘునందన్ , జహీరాబాద్ మాజీ ఎంపీ బీబీ పాటిల్‌లను వేంకటేశ్వరస్వామి మహారుద్ర పారాయణ కార్యక్రమానికి ఆహ్వానించారు. డిసెంబర్ 1న టేక్మాల్‌లోని స్వామి ఆలయంలో నిర్వహించే కార్యక్రమానికి రావాలని బీజేపీ మండల అధ్యక్షుడు నవీన్‌కుమార్ గుప్తా కోరారు. ఆయన వెంట బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, అసెంబ్లీ కన్వీనర్ విజయ్ కుమార్, మెదక్ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి మల్లిక అశోక్, నాయకులు సుధాకర్ రెడ్డి, సంతోశ్‌లు ఉన్నారు. – టేక్మాల్(మెదక్)

ఈసేవలో ఈఫైలింగ్ పొందొచ్చు



కోర్టు ఆవరణలో ఈ-సేవా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న జడ్జి సౌజన్య

నర్సాపూర్ రూరల్: ఈసేవా కేంద్రాన్ని కోర్టు కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ జూనియర్ సివిల్ జడ్జి సిరి సౌజన్య అన్నారు. నర్సాపూర్ సివిల్ కోర్టు ఆవరణలో ఈ సేవా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ సేవా కేంద్రాలు ఈ ఫైలింగ్‌లో కూడా సేవలను అందిస్తాయన్నారు. జైలులోని బంధువులను కలుసుకోవడానికి, ఇ-ములాఖత్ల నియామకం కోసం బుకింగ్ సదుపాయం కూడా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో ప్రభుత్వ న్యాయవాది సుధాకర్, శ్రీధర్ రెడ్డి, పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

కిటకిటలాడిన సీఎస్‌ఐ చర్చి

- రెండు పర్యాయాలు ప్రార్థన
- భక్తులకు దైవసందేశం ఇచ్చిన ప్రెసిబెటరీ

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన మెదక్ సీఎస్‌ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రెండు పర్యాయాలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశాన్ని ఇచ్చారు. మా పాపాలను తొలగించి మమ్ములను కాపాడాలని ఏసుప్రభును భక్తులు వేడుకున్నారు.



ప్రత్యేక ప్రార్థనలో భక్తులు

యువత ఓటరుగా నమోదు కావాలి

కౌడిపల్లి(నర్సాపూర్): 18 ఏళ్లు నిండిన యువతీ యువకులు ఓటరుగా నమోదు చేసుకోవాలని తహసీల్దార్ ఆంజనేయులు అన్నారు. ఆదివారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమం పరిశీలించారు. గ్రామాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు శిబిరాలలో అర్హులైన వారు ఓటరుగా నమోదుగా చేసుకోవాలన్నారు. చేర్పులు మార్పులతో పాటు సవరణలు చేసుకోవచ్చని సూచించారు. కార్యక్రమంలో బీఎల్ఓలు, తదితరులు పాల్గొన్నారు.

స్పెషల్ డ్రైవ్

పెద్ద శంకరంపేట (మెదక్): ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటరు నమోదుపై బీఎల్‌ఓలు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. శని, ఆదివారాల్లో మండలంలో నిర్వహించిన స్పెషల్ డ్రైవ్ లో 18 ఏళ్లు నిండిన యువతీ యువకుల నుంచి ఓటరు దరఖాస్తు స్వీకరించారు. కార్యక్రమాన్ని తహసీల్దార్ గ్రేస్ బాయ్ అధికారులు పర్యవేక్షించారు.



కౌడిపల్లి(నర్సాపూర్): ఓటరు నమోదును పరిశీలిస్తున్న తహసీల్దార్ ఆంజనేయులు

ఐక్యత దెబ్బతీయడానికే ఎస్సీ వర్గీకరణ

మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

రామాయంపేట(మెదక్): దళితుల మధ్య ఐక్యతను దెబ్బతీయడానికే ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరపైకి తెచ్చారని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పాదయాత్ర ఆదివారం రామాయంపేట చేరిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేసే మొదటి రాష్ట్రం తెలంగాణే అని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడాన్ని తప్పుబట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ అంశాన్ని విరమించుకోవాలని, లేకపోతే తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. అంతకుముందు సిద్దిపేట జిల్లా నుంచి మెదక్ జిల్లాలో ప్రవేశించిన పాదయాత్రకు సంఘం కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అలాగే, అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేడ్కర్ యూనివర్సిటీ నాయకులు, కుల సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.



పాదయాత్ర చేస్తున్న మాల మహానాడు నేతలు

అదుపుతప్పి కారు బోల్తా

- ప్రయాణికులకు స్వల్ప గాయాలు

కొల్చారం(నర్సాపూర్): అదుపుతప్పి కారు బోల్తా పడిన ఘటన కొల్చారం మండల సమీపంలోని మెదక్- నర్సాపూర్ జాతీయ రహదారిపై ఆదివారం చోటు చేసుకుంది. ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి ఏడుపాయల వన దుర్గాదేవి దర్శనానికి 8 మందితో బయలుదేరిన కారు లోతు వాగు సమీపంలో మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి బోల్తా పడింది. అటుగా వెళ్తున్న ప్రయాణికులు గమనించి కారులోని వారిని సురక్షితంగా బయటకు తీశారు. స్వల్పగాయాలు కావడంతో క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. అతివేగంగా నడిపించడమే ఈ ప్రమాదానికి కారణమని పేర్కొన్నారు.



బోల్తా పడ్డ కారు

గాయపడిన వ్యక్తి మృతి



విశ్వనాథం (ఫైల్)

పెద్ద శంకరంపేట (మెదక్): రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. ఈ సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. పెద్దశంకరంపేట మండల కేంద్రానికి చెందిన రంగరి విశ్వనాథం పది రోజుల క్రితం కమలాపురం వైపు బైక్ పై వెళ్తున్నాడు. కాగా ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో గాయపడిన అతడిని చికిత్స కోసం హైదరాబాద్ లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి విశ్వనాథం చెందాడు. అతని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆటో, కారు ఢీ .. పలువురికి గాయాలు

నర్సాపూర్ రూరల్: కారు.. ఆటోను వెనుక నుంచి ఢీకొనడంతో పలువురికి గాయాలయ్యాయి. ఈ ఘటన నర్సాపూర్-హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ చెందిన శివ గౌడ్, సువర్ణ, సంజన మరో ముగ్గురు ట్రాలీ ఆటోలో ఏడుపాయల దుర్గామాత దర్శనానికి వెళ్తున్నారు. అటవీ శాఖ కార్యాలయం వద్దకు రాగానే కారు వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. దీంతో ఆటో డివైడర్‌ను ఢీ కొట్టింది. అందులో ప్రయాణిస్తున్న శివ గౌడ్, సువర్ణ, సంజన మరో ఇద్దరు గాయాల పాలయ్యారు. క్షతగాత్రులను ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

అందుబాటులో వరి విత్తనాలు

శివ్వంపేట (నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని పీఏసీఎస్ చైర్మన్ వెంకటరామిరెడ్డి ఆదివారం తెలిపారు. రైతులకు కావాల్సిన సన్న రకం, దొడ్డు రకం వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సన్న రకం ధాన్యానికి సంబంధించి 15 కిలోల బస్తాలు ఆర్ఎన్ఆర్, జేజీఎల్, 1010 రకం అందుబాటులో ఉన్నాయన్నారు. బస్తా ధర రూ.700 అని తెలిపారు. దొడ్డు రకం కేఎస్ఎమ్ 118.. 25 కిలోల బస్తా ధర వెయ్యి రూపాయలని చెప్పారు. కార్యక్రమంలో సీఈఓ మధు, వైస్ చైర్మన్ వేణుగోపాల్ రెడ్డి తదితరులు ఉన్నారు.

పోచమ్మ ఆలయానికి భక్తుల తాకిడి



కౌడిపల్లి: తునికి నల్లపోచమ్మ దేవి ఆలయంలో భక్తుల పూజలు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మ దేవి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. మండలంలోని తునికికి పలు జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయ ఇన్‌చార్జి ఈఓ, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ రంగారావు, జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి ఆధ్వర్యంలో పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మకు పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులు అమ్మకి ఓడిబియ్యం, బోనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. అధికారులు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు.

అమ్మవారికి విశేష పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారి ఆలయానికి వచ్చిన భక్తులు అమ్మను దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం అమ్మవారికి కుంకుమార్చనలు, ప్రత్యేక పూజలను అర్చకులు నిర్వహించారు. యాత్రీకులు అమ్మవారికి ప్రదక్షిణలు చేసి ఓడిబియ్యం పోసి మొక్కులు చెల్లించారు. అనంతరం వారికి తీర్థప్రసాదాలను అందజేశారు.

భక్తిశ్రద్ధలతో శివ మహాపడిపూజ



రేగోడ్(మెదక్): శివమహాపడిపూజ చేస్తున్న గురుస్వాములు

రేగోడ్(మెదక్): శివస్వామి కర్ణకోటి మహేశ్ గృహంలో ఆదివారం శివ మహా పడిపూజ కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. శివ, అయ్యప్ప స్వాములు చేసిన భజన భక్తులను అలరించింది. మాలధరించిన భక్తులు నృత్యాలు చేస్తూ శివనామస్మరణ చేశారు. తీర్థప్రసాదాలతో పాటు అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శివ గురుస్వాములు సదానందం, సంగమేశ్వర్, అయ్యప్ప గురుస్వామి విఠల్‌రావు, మాజీ జెడ్పీటీసీ రాజేందర్ పాటిల్, కోఆప్షన్ మాజీ సభ్యుడు చోటుమియా, కృష్ణ, వెంకట్‌రెడ్డి, చక్రపాణి, రవి తదితరులు పాల్గొన్నారు.

నిజాంపేట(మెదక్): గురుస్వామి నాయిని వెంకటేశం స్వగృహంలో మహా పడిపూజ కార్యక్రమాన్ని గురుస్వామి రంజిత్‌గౌడ్, రెడ్డిశెట్టి రవీందర్, యాదగౌడ్‌ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి అయ్యప్పస్వాములు, గ్రామ మహిళలు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భజన, సంకీర్తనలతో గ్రామంలో ఆహ్లాద వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు రమణ పంతులు, వెంకటేశ్ గౌడ్, నవీన్ రెడ్డి, నవీన్ గౌడ్, రఘు, మధు, ,దనంజయ, శ్రీనివాస్ రెడ్డి, ప్రదీప్ రెడ్డి, వెంకటేశం, వెంకటరెడ్డి, వెల్దుర్తి శ్రీకాంత్ గౌడ్, మావురం రాజు, నాయిని శ్రీనివాస్, ప్రసాద్, రవి తదితరులు పాల్గొన్నారు.



నిజాంపేట: పడిపూజలో అయ్యప్ప మాలధారులు

సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

కార్తీక మాసం సందర్భంగా మండలంలోని కొత్తపల్లి.. హనుమాన్ ఆలయం వద్ద సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాన్ని భక్తి శ్రద్ధలతో శాస్త్రోక్తంగా నిర్వహించారు. దంపతులు వ్రతంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. తండాకు చెందిన రవీందర్‌నాయక్ ఆంజనేయ స్వామికి చందన అలంకరణ గావించారు. అన్నదానం ఏర్పాటు చేశారు. గ్రామస్తులు, తండా వాసులు పాల్గొన్నారు. కౌడిపల్లి(నర్సాపూర్):

సంక్షిప్త వార్తలు

◆ లక్ష్మీనరసింహస్వామికి ప్రత్యేక పూజలు

శివ్వంపేట (నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి ఆదివారం భక్తులు తరలివచ్చారు. ముందుగా కోనేరులో స్నానమాచరించి స్వామి తోపాటు గుట్టపై వెలిసిన లక్ష్మీనరసింహస్వామిని కాలినడకన ద్వారా వెళ్లి దర్శించుకున్నారు. అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

◆ ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం

శివ్వంపేట (నర్సాపూర్): గూడూరు సోమేశ్వరాలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠ మహోత్సవం ఆదివారం కనుల పండుగ ప్రారంభమైంది. ఆలయ పండితుడు రాజశేఖర్ శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠించనున్న రాతి ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు చేపట్టారు. సోమవారం కృష్ణ మహోత్సవం నిర్వహించనున్నారు.

◆ ఆలయ పునఃనిర్మాణంపై సమావేశం

మనోహరాబాద్(తూప్రాన్): అతి పురాతనమైన కాలకంఠేశ్వర దేవాలయ పునఃనిర్మాణానికి కాళ్లకల్ గ్రామస్తులు ఆదివారం సమావేశం నిర్వహించారు. ఆలయాన్ని నిర్మించేందుకు వర్గంటి దశరథరెడ్డి ముందుకు వచ్చారు. రూ.60 లక్షల నుంచి 80 లక్షలు నిర్మాణానికి అవసరమవుతాయని అంచనా వేశారు.

◆ బీజేపీ శ్రేణుల సంబురాలు

టేక్మాల్(మెదక్): మహారాష్ట్రలో బీజేపీ భారీ మెజార్టీతో గెలుపొందగా ఆదివారం టేక్మాల్ పార్టీశ్రేణులు సంబురాలు నిర్వహించారు. బస్టాండ్ ప్రాంగణంలో టపాసులు పేల్చి స్వీట్లు పంచుకున్నారు. భవిష్యత్‌లో తెలంగాణలో కూడా పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని ఆశాభావం వ్యక్తంచేశారు. సంబురాల్లో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



కొల్చారం: సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు



పెద్దశంకరంపేట: సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు, గురువులు

అపూర్వ విద్యార్థుల సమ్మేళనం

పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు ఆదివారం ఘనంగా జరిగాయి. చిన్నఘనాపూర్ నీటిపారుదల శాఖ అతిథి గృహం సమీపంలో రంగంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2000–01 బ్యాచ్ పదవ తరగతి పూర్వ విద్యార్థులు, చిన్నశంకరంపేట.. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 2005–06 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు కలుసుకున్నారు. ఒకరికొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. నాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాడు విద్యాబుద్ధులు నేర్పిన టీచర్లను సన్మానించారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కొల్చారం(నర్సాపూర్) /పెద్దశంకరంపేట(మెదక్):